


# కరపత్రం

SINCE 2014

బుధవారం సెప్టెంబర్ 30,2026 | సంపుటి : 2 | సంచిక : 352 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

### కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్ విజ్ఞప్తి

# బ్యారేజీ అనుమతులు త్వరగా ఇప్పించాలని కోరిన సీఎం



2లో..

- ఎఫ్ఆర్ఎల్ ౦152 మీటర్లపై అంగీకారం కోసం అభ్యర్థన
- ఎల్లంపల్లికి గ్రావిటీతో నీటి తరలింపు లక్ష్యం
- పలు ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు కోరిన ప్రభుత్వం
- సమ్మక్కసాగర్‌కు పెండింగ్ అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి
- టెలీమెట్రీ ఏర్పాట్లు త్వరగా చేపట్టాలని కోరిన రేవంత్

**ఢిల్లీ:**
తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి త్వరగా అనుమతులు ఇప్పించాలని కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్ కు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసిన సీఎం, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి.. కృష్ణా, గోదావరి బేసిన్లలో తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే అందించామని ముఖ్యమంత్రి తెలిపారు.

తుమ్మిడిహట్టి బ్యారేజీని ఎఫ్ఆర్ఎల్ ౦152 మీటర్ల స్థాయిలో నిర్మించేందుకు తెలంగాణ, మహారాష్ట్ర మధ్య త్వరగా అంగీకారం కుదిరేలా చూడాలని కోరారు. ఆ స్థాయిలో బ్యారేజీ నిర్మిస్తేనే గ్రావిటీ ఆధారంగా ఎల్లంపల్లికి నీటిని తరలించేందుకు వీలుంటుందని వివరించారు. పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాలు, సీతారామ సాగర్ బహుళార్ధక ప్రాజెక్టు, గౌరవెల్లి రిజర్వాయర్లకు పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనుమతుల జాప్యంతో ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం పెరుగుతోందని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘం వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులను త్వరగా మంజూరు చేయాలని కోరారు.



## గణేశ్ ఉత్సవాల వేళ.. షీ టీమ్స్‌కు చిక్కిన 2,935 మంది ఆకతాయిలు

**హైదరాబాద్:**
గణేశ్ ఉత్సవాల సమయంలో మహిళలు, యువతుల భద్రత కోసం హైదరాబాద్ నగర పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. సెప్టెంబర్ 14 నుంచి 26 వరకు ఖైరతాబాద్, బాలాపూర్ గణేశ్ మండపాలతో పాటు ప్రధాన రద్దీ ప్రాంతాలు, నిమజ్జన మార్గాల్లో షీ టీమ్స్ ను భారీగా మోహరించారు. ఈవ్‌టీజింగ్, వేధింపులు, ఇతర అసభ్య కార్యకలాపాలకు పాల్పడిన 2,935 మందిని షీ టీమ్స్ అదుపులోకి తీసుకున్నాయి. విచారణ అనంతరం 858 మందికి కౌన్సెలింగ్ ఇచ్చి హెచ్చరించి వదిలిపెట్టారు. మరో 69 మందికి న్యాయస్థానాలు శిక్షలు విధించాయి. వీరిలో 24 మందికి రూ.1,050 చొప్పున, 40 మందికి సామాజిక సేవతో పాటు రూ.1,050 జరిమానా విధించాయి. మరో ఐదుగురికి జరిమానాతో పాటు జైలు శిక్ష పడింది.

## ఓటర్ల జాబితా సవరణలో అవకతవకలు జరిగాయని ఖర్గే ఆరోపణ.



2 లో

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్.
- ఓటర్ల జాబితాల్లో మార్పుల వివరాలు బహిర్గతం చేయాలని సూచన.
- ప్రధాని మోదీ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్.
- ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత పెంచాలని ఖర్గే వ్యాఖ్య.
- అవసరమైతే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని కాంగ్రెస్ హెచ్చరిక.

# అక్టోబర్ నుంచి 1.58 కోట్ల కార్డులపై వేటు?

- రేషన్ తీసుకోని కార్డులు తాత్కాలికంగా నిలిపివేత
- లబ్ధిదారులకు 3 నెలల గడువు
- ఈ-కేవైసీ పూర్తి చేస్తే మళ్లీ యాక్టివేషన్
- పీడీఎస్ డేటాబేస్ ప్రక్షాళనకు కేంద్రం చర్యలు
- వలసలు, సాంకేతిక సమస్యలపై ఆందోళన



**న్యూఢిల్లీ:**
రేషన్ కార్డుల వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులు చేపట్టేందుకు సిద్ధమైంది. నిజమైన లబ్ధిదారులకు మాత్రమే ప్రభుత్వ ఆహార ధాన్యాల ప్రయోజనం అందేలా చూడటంతో పాటు పీడీఎస్ డేటాబేస్‌ను మరింత కచ్చితంగా నిర్వహించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రక్షాళన చేపట్టనుంది. ఇందులో భాగంగా.. గత ఆరు నెలల్లో రేషన్ కార్డ్ ద్వారా బియ్యం, ఇతర వస్తువులు తీసుకోని దాదాపు 1.58 కోట్ల రేషన్ కార్డులను 2026, అక్టోబర్ నుంచి తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు సమాచారం.

మిగతాద్ది 2 లో

## కాంగ్రెస్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలు

- సింగరేణి బొగ్గు టన్ను రూ.3,800
- విదేశీ బొగ్గు టన్ను రూ.9,000
- ఖరీదైన విదేశీ బొగ్గు దిగుమతిపై ప్రశ్నలు
- ప్రజలపై అదనపు భారం ఎందుకని కేటీఆర్ నిలదీత
- నిర్ణయం వెనుక ఎవరి ప్రయోజనాలంటూ ప్రశ్న



2 లో

### బొల్లారం ఆర్మరీ చోరీలో

# ఇన్‌సైడర్ కోణం!

- మల్లేష్‌తో నలుగురు ఆర్మీ సిబ్బంది టచ్‌లో ఉన్నట్లు సమాచారం.
- గార్డ్ డ్యూటీలు, సీసీటీవీలపై ముందే సమాచారం తెలుసుకున్నాడా?
- రూ.150కు ఇనుప రాడ్ కొనుగోలు చేసి లాక్‌లు పగలగొట్టినట్లు వెల్లడి.
- 90 నిమిషాల్లో ఆయుధాలు, మందుగుండు సామగ్రి చోరీ.
- ఆయుధాల కొనుగోలుదారుల నెట్‌వర్క్‌పై పోలీసుల ఆరా.
- 16 ఏళ్ల సర్వీస్ అనంతరం డిశ్చార్జ్.. ప్రతీకార కోణంలోనూ విచారణ.
- నలుగురు మాజీ సహచరుల పాత్రపై దర్యాప్తు.



2లో..

బొల్లారం ఆర్మరీ చోరీ కేసులో ఇన్‌సైడర్ యాంగిల్ కీలకంగా మారింది. మాజీ హవిల్దార్ మల్లేష్‌తో నలుగురు ఆర్మీ సిబ్బంది టచ్‌లో ఉన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. గార్డ్ డ్యూటీలు, ఆయుధాగారం భద్రత, సీసీటీవీల పనితీరుపై మల్లేష్‌కు లోపలి సమాచారం అందిందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రతి రాత్రి 8 గంటలకు సీసీటీవీలు ఆఫ్ అవుతాయన్న సమాచారం,




2లో..

## నిమ్స్ బార్బర్ ఇంట నోట్ల కట్టలు.. ఏసీబీ సోదాల్లో షాక్

**హైదరాబాద్:**
నగరంలో మరోసారి అవినీతి నిరోధక శాఖ తనిఖీల కలకలం రేగింది. నిమ్స్ ఉద్యోగుల నివాసాల్లో ఏసీబీ బృందాలు ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నాయి. అడిషన్ సూపరిండెంట్ డాక్టర్ లక్ష్మీ భాస్కర్ కేసులో భాగంగా ఐదు చోట్ల ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి.

2 లో



## కొందరు బాగుపడితేనే అభివృద్ధి కాదు..! మోహన్ భాగవత్

కొందరు మాత్రమే బాగుపడటం అభివృద్ధి కాదని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు సమానంగా అందితేనే అది సాధ్యమవుతోందని తెలిపారు. మహారాష్ట్ర లోని యవత్మాల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.



2 లో

## కాంగ్రెస్‌పై బండి సంజయ్ తీవ్ర విమర్శలు

- మోదీని ఎదుర్కోలేక ఈసీ, ఈవీఎంలను తప్పుపడుతున్నారన్న ఆరోపణ
- కాంగ్రెస్ గెలిచిన రాష్ట్రాల్లో ఈవీఎంలు గుర్తుకురాలేదా?
- ఓటరు జాబితా పారదర్శకంగా ఉండాలన్న బండి
- ఎస్ఐఆర్ ప్రక్రియపై ఆధారాలతో ప్రశ్నించాలని సవాల్
- ఎన్నికల్లో గెలుపోటములను ప్రజలే నిర్ణయిస్తారని వ్యాఖ్య



## “అవాకులు చవాకులు పేలితే ఊరుకోం”

- ప్రత్యర్థులకు తీవ్ర హెచ్చరిక
- “మా వర్గంలోని ఆడవాళ్లే చిత్తు చిత్తుగా కొడతారు”
- ఎంజీఎం ఘటనపై ప్రతిపక్షాల నిరసనలపై ఆగ్రహం
- త్వరలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అందుబాటులోకి
- నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమన్న సురేఖ

**వరంగల్:**
తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన పరిణామాల నేపథ్యంలో మాజీ మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ మౌనం వీడారు. ప్రత్యర్థులపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి వర్సెస్ కొండా సుస్మిత వ్యవహారంలో తలెత్తిన వివాదాల కారణంగా కొండా సురేఖ మంత్రివర్గం నుంచి బర్తరఫ్ అయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కొంతకాలం సైలెంట్‌గా ఉన్న ఆమె, తాజాగా జిల్లా రాజకీయాల్లో మళ్లీ యాక్టివ్ అయ్యారు. ప్రత్యర్థులకు చురకలంటించారు.

మిగతాది 2లో

## అసెంబ్లీ ఘటనపై హైకోర్టు కీలక ఆదేశాలు

- మహిళా ఎమ్మెల్యేలపై దురుసుగా వ్యవహరించిన పోలీసులను గుర్తించాలి
- బాధ్యులపై తీసుకున్న చర్యలతో నివేదిక ఇవ్వాలి
- నివేదికను స్పీకర్ ముందు ఉంచాలని ఆదేశం
- అసెంబ్లీ నిబంధనల ఉల్లంఘనపై స్పీకర్‌దే అధికారం
- ఎమ్మెల్యేలను అసెంబ్లీకి వెళ్లకుండా అడ్డుకోవద్దని స్పష్టం
- గేటు వద్ద జరిగిన ఘటనపై ప్రత్యేక నివేదిక కోరిన కోర్టు
- కేసు తదుపరి విచారణ 4 వారాలకు వాయిదా



2లో..

**హైదరాబాద్:**
తెలంగాణ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై హైకోర్టు మంగళవారం కీలక ఆదేశాలు జారీ చేసింది.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
బుధవారం సెప్టెంబర్ 30,2026

# బొల్లారం ఆర్మరీ చోరీలో ఇన్‌సైడర్ కోణం!

మొదటి పేజీ తరువాయి

ఆదివారాల్లో గార్డుల కదలికలు తక్కువగా ఉంటాయన్న విషయం ముందుగానే మల్లేష్‌కు తెలిసిందా? అనే అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈ సమాచారంతోనే ఆగస్టు 30 రాత్రి చోరీకి ప్లాన్ చేసినట్లు మల్లేష్ వాంగ్మూలంలో వెల్లడైనట్లు పోలీసులు చెబుతున్నారు.
బొల్లారం ఆర్మీ వెపన్స్ చోరి కేసులో కీలక అప్డేట్.. పోలీసుల విచారణలో సంచలన విషయాలు!

బొల్లారం ఆర్మరీ చోరీ కేసులో ఇన్‌సైడర్ యాంగిల్ కీలకంగా మారింది. చోరీ జరిగిన రాత్రి సుమారు 10 గంటలకు మల్లేష్ ఆయుధాగారం వద్దకు చేరుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆర్మరీ, మ్యాగజైన్ లాక్‌లను పగలగొట్టేందుకు యాప్రాల్‌లో రోడ్డుపక్కన వ్యాపారి వద్ద రూ.150కు ఇనుప రాడ్ కొనుగోలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. లాక్‌లు పగలగొట్టి ఆయుధాలు, మందుగుండు సామగ్రిని గోనె సంచుల్లో ప్యాక్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మొత్తం ఆపరేషన్‌కు సుమారు 90 నిమిషాల సమయం పట్టిందని మల్లేష్ చెప్పినట్లు సమాచారం. అనంతరం స్కూటర్‌పై ఆయుధాలను తరలించినట్లు, మిలిటరీ ప్రాంగణంలోకి బయటికి రెండుసార్లు వెళ్లినట్లు దర్యాప్తులో తేలినట్లు పోలీసులు చెబుతున్నారు.

చోరీ చేసిన ఆయుధాల్లో 9ఎంఎం పిస్టల్, 10 లైవ్ రౌండ్ల మ్యాగజైన్‌ను మల్లేష్ తన అద్దె ఇంట్లో ఉంచినట్లు పోలీసులు వెల్లడించారు. రాబోయే కొనుగోలుదారులకు చూపించేందుకే వాటిని ఇంట్లో ఉంచినట్లు మల్లేష్ చెప్పినట్లు సమాచారం. మిగిలిన ఆయుధాలను అచ్చంపేటలోని తన తండ్రి ఇంటి ఆవరణలో భూమిలో పూడ్చిపెట్టినట్లు విచారణలో వెల్లడైంది. మల్లేష్ ఇచ్చిన సమాచారంతో నాలుగు ఇూఖ-206 రైఫిళ్లు, ఒక INSAS రైఫిల్, ఆరు పిస్టళ్లు, మందుగుండు సామగ్రిని పోలీసులు రికవరీ చేసినట్లు తెలిపారు.
అయితే ఇంత భారీ స్థాయిలో ఆర్మరీ చోరీని మల్లేష్ ఒంటరిగా చేయడం సాధ్యమేనా? అనే అనుమానం పోలీసుల్లో నెలకొంది. చోరీకి ముందు మల్లేష్ నలుగురు మాజీ సహచరులతో సంప్రదింపులు జరిపినట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఆ నలుగురు సిబ్బంది పాత్రపై లోతుగా ఆరా తీస్తున్నారు. ఆయుధాల కొనుగోలుదారుల నెట్‌వర్క్ ఉందా? సోషల్ మీడియా ద్వారా మల్లేష్ ఆయుధాల కొనుగోలుదారుల కోసం సంప్రదింపులు జరిపాడా? అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది. యాంటీ సోషల్ ఎలిమెంట్స్‌కు అధునాతన ఆయుధాల డిమాండ్‌పై సమాచారం సేకరించాడా? ఆయుధాలను విక్రయించి డబ్బు సంపాదించాలనే ఉద్దేశం ఉందా? అనే అంశాలపై పోలీసులు ప్రశ్నిస్తున్నారు.

మల్లేష్ 16 ఏళ్ల సర్వీస్ అనంతరం జూన్ 30న డిశ్చార్జ్ అయ్యాడు. మరో మూడేళ్లు సర్వీస్ చేయాలనుకున్న మల్లేష్‌కు డిశ్చార్జ్‌పై అసంతృప్తి ఉందా? ఉన్నతాధికారులపై పగతోనే చోరీకి ప్లాన్ చేశాడా? అనే కోణంలోనూ పోలీసులు విచారిస్తున్నారు. చోరీ చేసిన ఆయుధాలను విక్రయించి కోల్పోయిన మూడేళ్ల సర్వీస్ ఆదాయాన్ని భర్తీ చేసుకోవాలని భావించినట్లు సమాచారం. సెప్టెంబర్ 11న మల్లేష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. సెప్టెంబర్ 22న చంచల్‌గూడ జైలు నుంచి మల్కాజ్‌గిరి పోలీసులు అతడిని కస్టడీలోకి తీసుకున్నారు. ప్రస్తుతం కస్టడీలో మల్లేష్‌ను ఇతరుల ప్రమేయం, ఆయుధాల కొనుగోలుదారులతో సంబంధాలు, చోరీకి ముందు జరిగిన సంప్రదింపులపై ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. మల్లేష్‌తో పాటు మరికొందరు అనుమానితులను కూడా పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.

# “అవాకులు చవాకులు పేలితే ఊరుకోం”

మొదటి పేజీ తరువాయి

‘మాపై అవాకులు చవాకులు పేలితే ఊరుకోం.. మగవాళ్ల వరకు కూడా అవసరం లేదు, మా వర్గంలోని ఆడవాళ్లే చాలు, దొరికిన చోటే చిత్తు చిత్తుగా చితకబాదుతాం’ అంటూ ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

**» లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ**

మంగళవారం వరంగల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్, కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కొండా సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు 112 చెక్కులను పంపిణీ చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రత్యర్థుల తీరుపై మండిపడ్డారు.

**» ఎంజీఎం ఘటనపై స్పందన**

ఇటీవల వరంగల్ నగరంలోని ఎంజీఎం ఆసుపత్రిలో పైకప్పు పెచ్చులూడి పలువురికి గాయాలైన ఘటనపై బీఆర్ఎస్, బీజేపీ నేతలు చేస్తున్న నిరసనలపై ఆమె స్పందించారు. ఆ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రాణాపాయం జరగకపోవడం అందరి అదృష్టమని, దీనిపై ప్రతిపక్షాలు చేస్తున్న నిరసనలు హాస్యాస్పదంగా ఉన్నాయని కొట్టిపారేశారు. అతి త్వరలోనే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని పేద ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు కూడా దాదాపు పూర్తయ్యాయని, కొన్ని ఫర్నిచర్, రంగుల పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

**» నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం**

మంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్ర వ్యాప్త బాధ్యతలు ఉండేవని, ఇప్పుడు ఎమ్మెల్యేగా కేవలం తన నియోజకవర్గ అభివృద్ధి కోసం శ్రమించే అవకాశం దక్కిందని, అందుకు ఎంతో ఆనందంగా ఉందని కొండా సురేఖ పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతలు గాల్లో కత్తులు తిప్పుతున్నారని, కొంతమంది నాయకులు తమ నోరు అదుపులో పెట్టుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమె గట్టి వార్నింగ్ ఇచ్చారు.

# అసెంబ్లీ ఘటనపై హైకోర్టు కీలక ఆదేశాలు

మొదటి పేజీ తరువాయి

మహిళా ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీసులను గుర్తించాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(ఔఈూ) ఆదేశించింది. ఘటనపై విచారణ జరిపి.. బాధ్యులపై తీసుకున్న చర్యల వివరాలతో నివేదికను స్పీకర్ ముందు ఉంచాలని సూచించింది. అలాగే అసెంబ్లీ నిబంధనలు ఉల్లంఘించినట్లయితే చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కే ఉంటుందని స్పష్టం చేసింది.
ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు ఎందుకు అడ్డుకున్నారని హైకోర్టు ప్రశ్నించింది. ఎమ్మెల్యేలు ప్లకార్డులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాతలున్న టీషర్టులతో అసెంబ్లీలోకి వెళ్లేందుకు ప్రయత్నించారని, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే పోలీసులు వారిని అడ్డుకున్నారని అడ్వొకేట్ జనరల్ ఏ. సుదర్శన్‌రెడ్డి వివరించారు. ఎమ్మెల్యేలు అసెంబ్లీ నియమావళితో పాటు నిషేధాజ్ఞలను ఉల్లంఘించారని, విధుల్లో ఉన్న మహిళా కానిస్టేబుళ్లతో అనుచితంగా ప్రవర్తించారని ఆయన వాదించారు.
అసెంబ్లీ సజావుగా జరిగేలా చూడాల్సిన బాధ్యత స్పీకర్‌పై ఉంటుందని.. ఆయన ఆదేశాల మేరకే చీఫ్ మార్షల్స్, పోలీసులు వ్యవహరించారని ఏజీ కోర్టుకు తెలిపారు. అయితే దీనిపై హైకోర్టు కీలక ప్రశ్నలు వేసింది. స్పీకర్ నుంచి పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయా? ఎమ్మెల్యేలను అడ్డుకోవాలని ఎలాంటి ఉత్తర్వులు జారీ చేశారు? అసెంబ్లీ నియమావళికి సంబంధించిన విషయాలను ఎమ్మెల్యేలకు ముందుగానే తెలియజేశారా? అని ప్రశ్నించింది.

**▪ మహిళా ఎమ్మెల్యేల విషయంలో ఎందుకలా?**

మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు ఎందుకు అనుచితంగా ప్రవర్తించారన్న అంశంపై హైకోర్టు తీవ్రంగా ప్రశ్నించింది. ఓ సీనియర్ మహిళా ఎమ్మెల్యే మెడపై చేయి వేసి ఎందుకు నెట్టారని ప్రశ్నించింది. మహిళా ఎమ్మెల్యేలు నల్ల చీరలు మాత్రమే ధరించారని, ప్లకార్డులు లేదా నినాదాలున్న టీషర్టులు ధరించలేదన్న అంశాన్ని కూడా కోర్టు ప్రస్తావించింది.

అయితే మహిళా ఎమ్మెల్యేలతో పోలీసులు అసభ్యంగా ప్రవర్తించారన్న ఆరోపణలను ఏజీ ఖండించారు. అలాంటి ఘటన జరగలేదని కోర్టుకు తెలిపారు. హైదరాబాద్ సీపీ సజ్జనార్ కౌంటర్ దాఖలు చేసిన తర్వాత పూర్తి వివరాలను పరిశీలిస్తామని చెప్పారు.

**▪ ‘నిబంధనలు ఉల్లంఘిస్తే స్పీకర్‌దే అధికారం’**

మరోవైపు బీఆర్ఎస్ తరపు న్యాయవాది ప్రభుత్వ వాదనలను వ్యతిరేకించారు. ఎమ్మెల్యేలు ఏదైనా అసెంబ్లీ నిబంధన ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కే ఉంటుందని.. పోలీసులు ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకునే అధికారం లేదని వాదించారు. చీఫ్ మార్షల్స్‌కు స్పీకర్ ఆదేశాలు ఇచ్చినట్లు ఎలాంటి ఉత్తర్వులు చూపలేదని తెలిపారు. శాంతిభద్రతలకు భంగం కలుగుతోందని భావించినా ఎమ్మెల్యేలను స్పీకర్ వద్దకు తీసుకెళ్లాల్సిందని.. అరెస్ట్ చేసి తెలంగాణ భవన్‌కు ఎందుకు తరలించారని ప్రశ్నించారు.

**▪ స్పీకర్ ఆదేశాలైతే.. ఆయన పరిధిలోనే**

స్పీకర్ ఆదేశాల మేరకే పోలీసులు వ్యవహరించి ఉంటే.. ఆ వ్యవహారం స్పీకర్ అధికార పరిధిలోకి వస్తుందని హైకోర్టు స్పష్టం చేసింది. అసెంబ్లీ నిబంధనల ఉల్లంఘన జరిగితే చర్యలు తీసుకునేది స్పీకర్ మాత్రమేనని పేర్కొంది. అదే సమయంలో ఘటన అసెంబ్లీ లోపల కాకుండా బయట, గేటు వద్ద జరిగి ఉంటే.. ఆ అంశంపై ప్రత్యేకంగా నివేదిక సమర్పించాలని ఆదేశించింది. మహిళా ఎమ్మెల్యేలు పోలీసులతో అనుచితంగా ప్రవర్తించినట్లు ఆధారాలు లేవన్న అంశాన్ని కూడా కోర్టు పరిగణనలోకి తీసుకుంది.

**▪ మధ్యంతర ఉత్తర్వుల్లో మార్పులు**

ఈ పరిణామాల నేపథ్యంలో గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు సవరించింది. మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా వ్యవహరించిన పోలీసులను గుర్తించి.. వారిపై తీసుకున్న చర్యల వివరాలను నివేదిక రూపంలో సమర్పించాలని డీజీపీని ఆదేశించింది. అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకోవద్దని స్పష్టం చేసింది. ఈ కేసులో తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

# నిమ్స్ బార్బర్ ఇంట నోట్ల కట్టలు.. ఏసీబీ సోదాల్లో షాక్

మొదటి పేజీ తరువాయి

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో లక్ష్మీ భాస్కర్ అరెస్టైన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిమ్స్‌కు చెందిన పలువురు ఉద్యోగుల ఇళ్లపై ఏసీబీ అధికారులు దృష్టి సారించారు. వారి ఇళ్లలో కీలకమైన డాక్యుమెంట్లు, నగదుకు సంబంధించిన వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. నిమ్స్‌లో బార్బర్‌గా పని చేస్తున్న ధన్‌రాజ్ ఇంట్లో సోదాలు నిర్వహించగా నోట్ల కట్టలు బయటపడినట్లు తెలుస్తోంది. బార్బర్ ధన్‌రాజ్ ఇంటి నుంచి ఏసీబీ అధికారులు రూ.7 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సోదాల్లో లభించిన పత్రాలు, నగదు, ఇతర ఆధారాలను ఏసీబీ అధికారులు పరిశీలిస్తున్నారు. భూముల డాక్యుమెంట్లు, నగదు లావాదేవీలకు సంబంధించినవి అందులో ప్రధానంగా ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాదు లక్ష్మీ భాస్కర్ కేసులో మరికొందరు స్టాఫ్ ఇళ్లలోనూ తనిఖీలు జరుగుతున్నాయి. భాస్కర్‌తో ఉన్న సంబంధం, ఆర్థిక లావాదేవీలపై వివరాలను సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఐదు ప్రాంతాల్లో ఒకేసారి సోదాలు కొనసాగుతుండటంతో నిమ్స్ వర్గాల్లో ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నోరి లక్ష్మీ భాస్కర్‌పై గతంలోనూ అవినీతి ఆరోపణలు వినిపించాయి. అయితే.. సెప్టెంబర్ 22న ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు. అదే రోజు ఆయన నివాసంతోపాటు బంధువులు, సన్నిహితులు, అనుబంధ వ్యక్తులకు చెందిన పలు ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు.
ఈ తనిఖీల్లో రూ.6.13 కోట్ల విలువైన ఆస్తులు గుర్తించినట్లు ఏసీబీ తెలిపింది. ఇందులో 8 ఫ్లాట్లు, 5 ఓపెన్ ప్లాట్లు, రూ.41 లక్షల బ్యాంకు బ్యాలెన్స్, రూ.12 లక్షల పోస్టాఫీస్ డిపాజిట్లు, రూ.35 లక్షల పెట్టుబడులు, రూ.29.55 లక్షల మ్యూచువల్ ఫండ్స్, 517.8 గ్రాముల బంగారు ఆభరణాలు, మూడు కార్లు, నాలుగు ద్విచక్ర వాహనాలు ఉన్నట్లు వెల్లడించింది.

# యువకుడిని ఇంట్లోకి పిలిపించి.. చున్నీ గొంతుకు బిగించి..

హైదరాబాద్: తనను వేధిస్తున్న ఓ యువకుడిని పుట్టింటికి పిలిపించి చున్నీ గొంతుకు బిగించి ఓ మహిళ హత్య చేసింది. ఈ సంఘటన మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రహీంపురాలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. శివలాల్‌నగర్‌లో అనిషా సింగ్ ఆమె భర్త లకన్ సింగ్‌లు నలుగురు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నారు. అదే ప్రాంతంలో నివసించే సాయినాథ్ సింగ్ (26) తరచూ అనిషాసింగ్‌ను వేధిస్తున్నాడు. ఈ విషయం భర్తకు, కొంతమందికి చెప్పడంతో వారందరూ సాయినాథ్‌సింగ్‌ను హెచ్చరించారు. అయినప్పటికీ సోమవారం అనిషాకు ఫోన్ చేసిన సాయినాథ్‌సింగ్ తనను కలవాలని వేధించాడు. దీంతో సమీపంలోని రహీంపురాలో ఉన్న



తన పుట్టింటికి రావాలని ఆమె సూచించింది. అక్కడకు వచ్చిన సాయినాథ్ సింగ్ మెడకు చున్నీ బిగించి హతమార్చింది. అనిషాసింగ్‌తో పాటు మరికొందరు అతడిని చంపేందుకు సహకరించి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. విచారణలో భాగంగా పరిసర ప్రాంతాల్లో సీసీ ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఘటన స్థలాన్ని గోల్కొండ జోన్ డీసీపీ జె.రాఘవేందర్ రెడ్డి, కుల్సుంపురా డివిజన్ ఏసీపీ తిరుపతి సందర్శించారు.

# ఓ క్రమపద్ధతిలో ప్రజాస్వామ్య పునాదులు ధ్వంసం - సీడబ్ల్యూసీ సమావేశంలో ఖర్గే

మొదటి పేజీ తరువాయి

ఓటర్ల జాబితా సవరణ లో అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అవకతవకలకు ప్రధాని మోదీ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలన్నారు. ప్రజాస్వామ్య పునాదులను, రాజ్యాంగ బద్ధమైన స్వతంత్ర వ్యవస్థలను ఒక క్రమపద్ధతిలో ధ్వంసం చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించారు. మంగళవారం దిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

“ఎన్నికల జాబితాల్లో మార్పులకు సంబంధించిన సమాచారం మొత్తం బహిర్గతం చేయాలి. రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితాలను సకాలంలో అందించాలి. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత పెంచాల్సిన అవసరం ఉంది” అని ఖర్గే సూచించారు. ఎన్నికల కమిషన్‌లోని ఇద్దరు కమిషనర్లు.. సీఈసీ చర్యలు ఏకపక్షంగా ఉన్నాయని పేర్కొన్నారని ఖర్గే వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ ఆ పదవిలో కొనసాగడానికి అనర్హుడని వ్యాఖ్యానించారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ భాజపా చేతిలో కీలుబొమ్మలా మారారని విమర్శించారు. ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా సాగేందుకు.. ప్రతి భారతీయుడి ఓటుహక్కును కాపాడేందుకు పోరాడాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అవసరమైతే వాటిని సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేపడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ కి అండగా నిలిచిన పార్టీ నేతలు, కార్యకర్తలకు ఖర్గే కృతజ్ఞతలు తెలిపారు.

# కొందరు బాగుపడితేనే అభివృద్ధి కాదు..! మోహన్ భాగవత్

మొదటి పేజీ తరువాయి

“ముఖ్యంగా పేదలు, వెనుకబడిన వర్గాలు ఉన్నతస్థాయికి చేరాలి. సమాజంలో అట్టడుగువర్గాలు కూడా సంతోషంగా ఉండాలి. అప్పుడే దేశం సంతోషంగా ఉంటుంది. అభివృద్ధి కేవలం ప్రభుత్వం బాధ్యత మాత్రమే కాదు. ప్రజలు కూడా అందులో భాగస్వాములు కావాలి” అని భాగవత్ పిలుపునిచ్చారు.

“అందరూ ఒకే స్థాయిలో ఉండటం సాధ్యం కాకపోయినప్పటికీ.. ధనికులు, పేదల మధ్య తేడా ఎక్కువగా ఉండకూడదు. ప్రతి ఒక్కరికీ ఆహారం, దుస్తులు, ఇల్లు కనీస సదుపాయాలు అందాలి. విద్య, వైద్యం అందుబాటులో ఉండాలి. అభివృద్ధి కోసం ప్రకృతిని నాశనం చేయడం సరికాదు. దేశంలో సేంద్రియ, మిశ్రమ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల కోసం ఇతరులపై ఆధారపడకుండా రైతులు స్వయం సమృద్ధి సాధించాలి” అని సూచించారు.

# అక్టోబర్ నుంచి 1.58 కోట్ల కార్డులపై వేటు?

మొదటి పేజీ తరువాయి

అయితే, లబ్దిదారుల పేర్లను వెంటనే ప్రభుత్వ డేటా బేస్ నుంచి తొలగించరు. లబ్ధిదారులకు మూడు నెలల సమయం ఇస్తారు. ఈ వ్యవధిలో లబ్ధిదారులు ఈ కేవైసీ ప్రక్రియను పూర్తి చేసి తాము అర్హులమని నిరూపించుకుంటే కార్డులను తిరిగి యాక్టివేట్ చేస్తారు. ఈ చర్య ద్వారా రేషన్ సరుకులు వాస్తవంగా అవసరమైన అర్హులైన కుటుంబాలకే చేరేలా చేయడంతో పాటు, పీడీఎస్‌లోని యాక్టివ్?గా కార్డులను గుర్తించి డేటాబేస్‌ను ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.
ఈ విధానంపై కొంతమంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ తీసుకోని కారణాన్ని ముందుగా తెలుసుకోకుండా, కార్డును ఉన్నఫలంగా ఆపివేయడంతో నిజమైన లబ్ధిదారులు కూడా ఇబ్బంది పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం అవుతోంది. సాంకేతిక సమస్యలు, వలసలు వంటి కారణాలతో కొందరు లబ్ధిదారులు రేషన్ తీసుకోలేరు. అటువంటి కార్డులను రద్దు చేస్తే లబ్దిదారులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

# మరో తుగ్లక్ నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

టన్ను రూ.3,800 చొప్పున వచ్చే సింగరేణి బొగ్గును జెన్‌కోకు వద్దని.. టన్ను రూ.9,000కి వచ్చే విదేశీ బొగ్గు దిగుమతికి అంగీకరించడం.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న మరో తుగ్లక్ నిర్ణయమని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఇదంతా ఎవరి ప్రయోజనం కోసం చేస్తున్నారని, రాష్ట్ర ప్రజలు ఈ భారాన్ని ఎందుకు మోయాలని ప్రశ్నించారు. “దక్షిణ భారతంలోనే అతిపెద్ద బొగ్గు నిల్వలు తెలంగాణలో ఉన్నాయి. ఏపీ, తమిళనాడు, మహారాష్ట్రలకు బొగ్గును సరఫరా చేసేది సింగరేణి సంస్థే. కేసీఆర్ ప్రభుత్వ పాలనలో సింగరేణి బొగ్గుతోనే టీఎస్ జెన్‌కో ద్వారా 24 గంటల విద్యుత్ సరఫరాను అందించాం” అని కేటీఆర్ ‘ఎక్స్’ వేదికగా పేర్కొన్నారు.

# బ్యారేజీ అనుమతులు త్వరగా ఇప్పించాలని కోరిన సీఎం

మొదటి పేజీ తరువాయి

ప్రాజెక్టు డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి సమర్పించామని, నీటిపారుదల ప్రణాళిక, అంతర్రాష్ట్ర అంశాలకు సంబంధించిన అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం పొందేందుకు తాము చర్చిస్తున్నట్లు చెప్పారు.
కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఆధ్వర్యంలో చేపడుతున్న టెలీమెట్రీ యంత్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని రేవంత్‌రెడ్డి కోరారు. మొదటి దశ టెలీమెట్రీ యంత్రాల ఏర్పాటుకు అవసరమైన రూ.4.15 కోట్లను తమ ప్రభుత్వం ఇప్పటికే జమ చేసిందన్నారు.

# మోదీని ఎదుర్కోలేక ఈసీ, ఈవీఎంలపై నిందలేస్తారా?: బండి సంజయ్

మొదటి పేజీ తరువాయి

ప్రధాని మోదీని ఎదుర్కొనే దమ్ములేక ఎన్నికల సంఘం, ఈవీఎంలపై నిందలేస్తారా? అని కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ గెలిచినప్పుడు సీడబ్ల్యూసీకి ఈవీఎంలు గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. సర్ ప్రకియ వల్లే గెలిచామని కేరళ కాంగ్రెస్ నేతలు ప్రకటించిన విషయాన్ని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ మర్చిపోయిందా? అని నిలదీశారు. “మోదీ ఎందుకు రాజీనామా చేయాలి? మూడుసార్లు వరుసగా దేశ ప్రజలు అప్రతిహతంగా గెలిపించినందుకు రాజీనామా చేయాలా? దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ గొప్పతనాన్ని, భారతీయుల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెబుతున్నందుకు రాజీనామా చేయాలా? మోదీ ప్రభుత్వాన్ని బ్రిటీష్ పాలనతో పోల్చడం హేయనీయం. భారత ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేయడమే. దసర్ సిబ్బంది అంతా రాష్ట్ర ప్రభుత్వ అధికారులే కదా? సర్‌లో పొరపాట్లు దొర్లితే సరిదిద్దుకునే వ్యవస్థ ఉంది. కేంద్రంపై నెపం నెట్టడం దుర్మార్గం. ఇటలీ మూలాలున్న కాంగ్రెస్ నేతలకు భారత ప్రజాస్వామ్యమంటే చులకన. సర్ కొత్త ప్రక్రియ కానేకాదు. గతంలోనూ నిర్వహించారు. సుప్రీంకోర్టు కూడా దీన్ని సమర్థించింది. ఎన్నికల్లో ఎవరు గెలవాలనేది ప్రజలు నిర్ణయిస్తారు. ఎన్నికల్లో ఎవరు ఓటు వేయాలనేది చట్టబద్ధమైన ఓటరు జాబితా నిర్ణయిస్తుంది. ప్రజాస్వామ్యంలో ఓటు పవిత్రమైనదైతే.. ఓటరు జాబితా కూడా అంతే పవిత్రంగా ఉండాల్సిందే. సర్ ప్రక్రియతో ఎన్నికల సంఘం చేసిన తప్పేమిటి? ఆధారాలుంటే బయటపెట్టండి” అని బండి సంజయ్ సవాల్ విసిరారు.

# చదువు కొరకు ఆరాటం- కోర్టుల్లో పోరాటం

# స్థానికత అంశంతో విద్యార్థులు విలవిల

**బోయిని సత్యనారాయణ, అడ్వకేట్**

జెల్ల అంకిత అనే విద్యార్థిని తనకు తన స్వరాష్ట్రం తెలంగాణలో స్థానికత ఖాయం చేయాలని వేసిన కేసులో మొన్న తేది: 28 సెప్టెంబర్ 2024 రోజున భారత సుప్రీంకోర్టు ఒక తీర్పు విలువరించింది.

జెల్ల అంకిత వర్సెస్ ది స్టేట్ ఆఫ్ తెలంగాణ కేసుపై సుప్రీం కోర్టులో వేసిన అప్పీల్, స్పెషల్ లీవ్ పిటిషన్ నెంబర్: SLP(C) No. 33862/2026..
డైరీ నెంబర్ (Diary Number): 58391 / 2026 అనే కేసు విద్యార్థుల తీవ్ర సమస్యకు ఒక ఉదాహరణ.

విద్యార్థుల స్థానికత .. Local Status అనేది ఉన్నత విద్యా ప్రవేశాలలో మరియు ఉపాధి అవకాశాలలో అత్యంత కీలకమైన అంశం.

### స్థానికత అంటే ఏమిటి?

▪ ఒక విద్యార్థి ఒక నిర్దిష్ట రాష్ట్రానికి లేదా ప్రాంతానికి చెందిన "స్థానిక నివాసి/అభ్యర్థి" అని ధృవీకరించే ప్రక్రియను స్థానికత అంటారు.

**దీని ఆధారంగానే విద్యాసంస్థల్లో ముఖ్యంగా మెడికల్, ఇంజనీరింగ్ వంటి ప్రొఫెషనల్ కోర్సుల్లో 85% స్థానిక కోటా సీట్లు లభిస్తాయి. మిగిలిన 15% సీట్లు అన్‌రిజర్వ్‌డ్ లేదా నాన్-లోకల్ కేటగిరీ కింద భర్తీ చేయబడతాయి.**

### చారిత్రక మరియు రాజ్యాంగ నేపథ్యం

▪ తెలుగు రాష్ట్రాల్లో స్థానికతను నిర్ణయించడంలో రాష్ట్రపతి ఉత్తర్వులు.. రెసిడెన్షియల్ ఆర్డర్స్, 1974 మరియు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 371 (D) అత్యంత కీలకమైనవి.

వెనుకబడిన ప్రాంతాల విద్యార్థులకు సమాన విద్యావకాశాలు కల్పించడానికి ఈ ప్రత్యేక నిబంధనలను చేర్చారు.

▪ దీని ప్రకారం విద్యాభ్యాసం చేసిన కాల వ్యవధి ఆధారంగానే స్థానికతను నిర్ణయిస్తారు.

**తెలంగాణలో మారుతున్న స్థానికత నిబంధనలు**

తెలంగాణ ప్రభుత్వం 2024 లో తీసుకొచ్చిన జీవో నెంబర్ 33 వైద్య విద్య (MBBS, BDS) ప్రవేశాల్లో స్థానికతను నిర్ణయించడంలో కీలక మార్పులు చేసింది.

**నాలుగేళ్ల నిరంతర విద్యాభ్యాస నిబంధన**

ఈ నిబంధన ప్రకారం విద్యార్థి నీట్ పరీక్ష లేదా కౌన్సెలింగ్‌కు ముందు 9వ తరగతి నుండి ఇంటర్మీడియట్ అంటే 12వ తరగతి వరకు వరుసగా 4 సంవత్సరాలు తెలంగాణలోనే చదివి ఉండాలి.

**సుప్రీంకోర్టు కీలక తీర్పు** ఉన్నత చదువుల కోసం ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిన కొంతమంది తెలంగాణ విద్యార్థులు తమకు స్థానికత నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

**అయితే, సుప్రీంకోర్టు తెలంగాణ ప్రభుత్వ జీవో 33 ని మరియు నాలుగేళ్ల నిరంతర విద్యాభ్యాస నిబంధనను సమర్థించింది.**

తల్లిదండ్రులు, తాతలు ఎక్కడ ఉంటున్నారనే దానితో సంబంధం లేకుండా, చదువు కోసం రాష్ట్రం దాటితే స్థానికత వర్తించదని, రాష్ట్రపతి ఉత్తర్వులను ఉల్లంఘించలేమని కోర్టు స్పష్టం చేసింది.

### ఏపీ – తెలంగాణ సరిహద్దు విద్యార్థుల సమస్యలు

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం పదేళ్ల పాటు (2014-2024) ఉన్న ఉమ్మడి నిబంధనల గడువు ముగియడంతో, ఉమ్మడి కోటాలు నిలిచిపోయాయి.

**నాన్-లోకల్ కోటా రద్దు** తెలంగాణ ప్రభుత్వం 2025 నుండి ఇంజనీరింగ్ (EAPCET) వంటి కోర్సులలో ఏపీ విద్యార్థులకు నాన్-లోకల్ కోటా సీట్లను అధికారికంగా నిలిపివేసింది.
అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సైతం తన ఉన్నత విద్యా సంస్థల్లో తెలంగాణతో సహా ఇతర రాష్ట్రాల విద్యార్థులకు నాన్-లోకల్ కోటాను తొలగించి, 15% అన్‌రిజర్వ్‌డ్ సీట్లను కేవలం ఏపీ విద్యార్థులకే పరిమితం చేస్తూ నిబంధనలను సవరించింది.

**సరిహద్దు ప్రాంతాల ఇబ్బందులు**
ఖమ్మం, భద్రాచలం లేదా ఏపీ-తెలంగాణ బోర్డర్ జిల్లాల్లో చదువుకునే విద్యార్థులు పాఠశాల విద్య ఒక రాష్ట్రంలో, ఇంటర్మీడియట్ మరో రాష్ట్రంలో చదవడం వల్ల రెండు రాష్ట్రాల్లోనూ లోకల్ స్టేటస్ కోల్పోయి తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారు.

**విద్యార్థుల స్థానికత నిర్ణయించే సూత్రాలు**
పాత vs కొత్త విధానం
**7 ఏళ్ల నిబంధన** (సాధారణ చట్టం)
**ఒక అభ్యర్థి వరుసగా ఏడేళ్ల పాటు ఏ ప్రాంతంలో ఎక్కువ కాలం .. కనీసం 4 ఏళ్లు చదివితే ఆ ప్రాంత స్థానికుడిగా పరిగణిస్తారు.**

కొత్త ప్రొఫెషనల్ కోర్సుల రూల్ .. ఉదా: వైద్య విద్య లో అర్హత పరీక్షకు ముందు చివరి 4 సంవత్సరాలు 9 నుండి 12 వ తరగతి వరకు నిరంతరాయంగా సదరు రాష్ట్రంలోనే చదవాలి.

**వలస నిబంధనలు** (Migrants)
విభజన సమయంలో ఏపీకి వలస వెళ్లిన వారికి నిర్దేశిత గడువు లోపు ప్రత్యేక స్థానికత ధృవీకరణ పత్రాలు (Local Status Certificate) జారీ చేశారు.

▪ స్థానికత అంశానికి తెలంగాణలో సుదీర్ఘమైన పోరాట చరిత్ర ఉన్నది

### తెలంగాణ ముల్కీ ఉద్యమం

'ముల్క్' అంటే అరబిక్ భాషలో దేశం లేదా ప్రాంతం అని అర్థం.

నైజాం పాలించిన ఈ ప్రాంతంలో స్థిరపడిన నివాసితులను 'ముల్కీలు' అని, బయటి ప్రాంతాల నుండి వచ్చిన వారిని 'గైర్ ముల్కీలు' అని పిలిచేవారు.

**తెలంగాణ అస్తిత్వ పోరాటానికి, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఈ ముల్కీ నిబంధనలే మూలస్తంభాలుగా నిలిచాయి.**

### ముల్కీనేపథ్యం

▪ 1888 మరియు 1910 ఫర్మానాల ప్రకారం ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీ ఖాన్ కాలంలో దివాన్ సాలార్ జంగ్ ప్రవేశపెట్టిన పరిపాలనా సంస్కరణల వల్ల ఉత్తర భారతదేశం (కాయస్థులు, ముస్లింలు) మరియు మద్రాస్ ప్రెసిడెన్సీ నుండి పెద్ద ఎత్తున గైర్ ముల్కీలు వచ్చి హైదరాబాద్ ప్రభుత్వ ఉద్యోగాలను చేజిక్కించుకున్నారు.

దీనితో స్థానికుల్లో అసంతృప్తి పెరిగింది. దీనిని గమనించిన ఆరో నిజాం 1888 మరియు 1910లలో ఫర్మానాలు (రాజశాసనాలు) జారీ చేస్తూ, ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానికులకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.

**1919 నాటి చారిత్రాత్మక ఫర్మానా**
ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ 1919




ఆగస్టు 27న ఒక సమగ్రమైన ముల్కీ ఫర్మానాను విడుదల చేశారు.

▪ దీని ప్రకారం హైదరాబాద్ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగం పొందడానికి ఒక వ్యక్తి కనీసం 15 సంవత్సరాలు ఆ రాజ్యంలో నిరంతరాయంగా నివసించి ఉండాలి.

### 1952 నాటి ముల్కీ ఉద్యమం

సిటీ కాలేజ్ ఘటన...

**భారతదేశంలో హైదరాబాద్ సంస్థానం విలీనమైన తర్వాత (1948), మిలిటరీ పరిపాలన మరియు వెల్లోడి ప్రభుత్వ కాలంలో మళ్లీ నాన్-ముల్కీల (ప్రధానంగా ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారి) ప్రవేశం పెరిగింది.**

స్థానిక తెలంగాణ నిరుద్యోగులు అవకాశాలు కోల్పోవడంతో 1952లో పెద్ద ఎత్తున ఉద్యమం ఉధృతంగా సాగింది.

**"నాన్-ముల్కీ గో బ్యాక్"**
"ఇడ్లీ సాంబార్ గో బ్యాక్" అనే నినాదాలతో విద్యార్థులు వీధుల్లోకి వచ్చారు.

**సిటీ కాలేజ్ కాల్పులు** 1952 సెప్టెంబర్ 3 వరంగల్‌లో ప్రారంభమైన ఈ విద్యార్థి ఉద్యమం హైదరాబాద్‌కు పాకింది.

సెప్టెంబర్ 3న సిటీ కాలేజ్ వద్ద జరిగిన శాంతియుత ప్రదర్శనపై పోలీసులు జరిపిన కాల్పుల్లో నలుగురు విద్యార్థులు మరణించారు.

ఈ ఘటనపై విచారణకు ప్రభుత్వం జస్టిస్ పింగళి జగన్మోహన్ రెడ్డి కమిటీని నియమించింది.

**పెద్ద మనుషుల ఒప్పందం**

ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలను కలిపి 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసే సమయంలో తెలంగాణ ప్రయోజనాల రక్షణ కోసం "పెద్ద మనుషుల ఒప్పందం" (Gentlemen's Agreement) జరిగింది.

దీని తర్వాత కూడా ఒప్పంద ఉల్లంఘనలు జరుగుతున్నాయని ప్రతిఘటనలు ఎదురయ్యాయి.

**పార్లమెంట్ సైతం దీనికి అనుగుణంగా 'పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ యాక్ట్-1957' ను ఆమోదించింది. అయితే, ఆచరణలో ఈ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ వేలాది మంది నాన్-ముల్కీలను తెలంగాణ ప్రాంతంలో నియమించారు.**

### 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమం

ముల్కీ నిబంధనల ఉల్లంఘనలు, తెలంగాణకు కేటాయించిన మిగులు నిధుల (Surplus Funds) మళ్లింపుపై 1969లో ఖమ్మం జిల్లాలో పాల్వంచ కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (KTPS) ఉద్యోగులు మరియు విద్యార్థి నాయకుడు అన్నబత్తుల రవీంద్రనాథ్ నిరాహార దీక్షతో ఉద్యమం మళ్లీ రాజుకుంది.

### కోర్టుల తీర్పులు

ముల్కీ నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పు ఇవ్వడం తెలంగాణ ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించింది. ఆ తర్వాత 1972లో సుప్రీంకోర్టు ముల్కీ నిబంధనలు చెల్లుబాటు అవుతాయని తీర్పు ఇచ్చింది. దీనికి వ్యతిరేకంగా ఆంధ్రా ప్రాంతంలో 'జై ఆంధ్ర' ఉద్యమం ప్రారంభమైంది.

### ఆర్టికల్ 371 (D) మరియు 6 సూత్రాల పథకం (1973)

రాజకీయ సంక్షోభాన్ని నివారించడానికి కేంద్ర ప్రభుత్వం 1973లో ఆరు సూత్రాల పథకాన్ని ప్రవేశపెట్టింది.

దీని ఆధారంగా భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 371 (D) ని చేర్చారు.

దీని ద్వారా పాత ముల్కీ నిబంధనల స్థానంలో 1975 నాటి రాష్ట్రపతి ఉత్తర్వులు, ప్రెసిడెన్షియల్ ఆర్డర్స్ అమల్లోకి వచ్చాయి.

▪ రాష్ట్రాన్ని వివిధ జోన్లుగా విభజించి, విద్య మరియు ఉద్యోగాల్లో స్థానిక కోటాలను శాశ్వతంగా చట్టబద్ధం చేశారు.

▪ అయినప్పటికీ విద్యార్థుల స్థానికత సమస్య, ఉద్యోగాల సమస్య ఇంకా ఇప్పటి తరాలను కూడా పీడిస్తూనే ఉంది.

విద్యార్థుల భవిష్యత్తును మరియు కెరీర్‌ను ఇబ్బందుల్లో పడేస్తున్న స్థానికత సమస్యకు శాశ్వత పరిష్కారాలు కనుగొనడం అత్యంత ఆవశ్యకం.

ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విద్యాభ్యాసం చేసి, కేవలం సాంకేతిక కారణాల వల్ల (ఉదాహరణకు 4 ఏళ్ల నిరంతర రూల్) రెండు రాష్ట్రాల్లోనూ నాన్-లోకల్‌గా మారిపోతున్న విద్యార్థుల మానసిక ఆందోళనను తగ్గించడానికి ప్రభుత్వాలు, మేధావులు, విద్యార్థి నాయకులు, పౌర సమాజం కలిసి పరిష్కారాన్ని వెతకాల్సిన అవసరం ఉంది.

**డోమిసియల్ (నివాస) ఆధారిత" స్థానికత గుర్తింపు**
ప్రస్తుత నిబంధనలు కేవలం విద్యార్థి ఎక్కడ చదివాడనే "విద్యాభ్యాస కాలం" ఆధారంగానే స్థానికతను నిర్ణయిస్తున్నాయి.

దీనికి బదులుగా విద్యార్థి తల్లిదండ్రులు స్థానికంగా నివసిస్తున్నట్లు (రేషన్ కార్డ్, ఆధార్, ఓటర్ ఐడీ, ఆస్తి పత్రాల ద్వారా) రుజువు ఉంటే, సదరు విద్యార్థి చదువు కోసం పక్క రాష్ట్రానికి వెళ్లినా స్థానికతను నిరాకరించకూడదు.

**నివాస ధృవీకరణ** (Domicile Certificate) ఇతర భారతీయ రాష్ట్రాల మాదిరిగా నిర్దిష్ట కాలం పాటు ఆ రాష్ట్రంలో నివసించిన కుటుంబాల పిల్లలను స్థానికులుగా గుర్తించేలా నిబంధనలు సవరించాలి.

### సరిహద్దు మరియు వలస విద్యార్థులకు ప్రత్యేక మినహాయింపులు

ఖమ్మం, భద్రాచలం, సూర్యాపేట లేదా ఏపీలోని కృష్ణా, గుంటూరు వంటి సరిహద్దు జిల్లాల్లోని విద్యార్థులు పాఠశాల విద్యాభ్యాసం ఒక రాష్ట్రంలో, ఇంటర్మీడియట్ మరో రాష్ట్రంలో చదవడం సర్వసాధారణం. ఇలాంటి విద్యార్థుల కోసం రాష్ట్రపతి ఉత్తర్వులలో ప్రత్యేక సవరణలు లేదా మినహాయింపులు తీసుకురావాలి.

### నిరంతరాయ రూల్-సరళీకరణ

9వ తరగతి నుండి 12వ తరగతి వరకు నిరంతరంగా ఒకే రాష్ట్రంలో చదవాలనే కఠిన నిబంధనను సవరించి, మొత్తంగా 7 ఏళ్ల కాలంలో కనీసం 4 ఏళ్లు ఏ రాష్ట్రంలో చదివితే అక్కడ లోకల్ స్టేటస్ ఇచ్చే పాత పద్ధతిని (నిరంతరాయం అనే పదం లేకుండా) పునరుద్ధరించాలి.

### రాష్ట్రాల మధ్య ఒప్పందాలు Inter-State Bilateral Agreements

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ ప్రభుత్వాలు సమన్వయంతో ఒక పరస్పర ఒప్పందాన్ని కుదుర్చుకోవాలి.

### నో-మ్యాన్స్ ల్యాండ్

సాంకేతిక కారణాల వల్ల ఏ రాష్ట్రంలోనూ స్థానికత దక్కని విద్యార్థులను గుర్తించి, వారిని ప్రత్యేక కేటగిరీ కింద పరిగణించాలి.

పరస్పర సీట్ల కేటాయింపు
రెండు రాష్ట్రాల సరిహద్దు విద్యార్థుల ప్రయోజనాల కోసం ఒకరి విద్యాసంస్థల్లో మరొకరికి నిర్దిష్ట శాతం సీట్లను పరస్పర అంగీకారంతో కేటాయించుకోవాలి.

### రాజ్యాంగ సవరణలు

కేంద్ర ప్రభుత్వ జోక్యం చేసుకొని తెలుగు రాష్ట్రాల్లో విద్యార్థుల స్థానికత అంశాన్ని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 371 (D) మరియు రాష్ట్రపతి ఉత్తర్వులకు లోబడి నిర్ణయాన్ని వెలువరించాలి.

### మారుతున్న పరిస్థితులు

రాష్ట్ర విభజన తదనంతర పరిణామాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుని, పార్లమెంట్‌లో రాష్ట్రపతి ఉత్తర్వులకు సవరణలు చేయాలి.

విద్యార్థులు తమకు నచ్చిన చోట చదువుకునే ప్రాథమిక హక్కును దెబ్బతీయకుండా, విద్యా హక్కు చట్టం (RTE) పరిధిలోకి స్థానికత అంశాన్ని సవరించాలి.

ముందస్తు హెచ్చరికలు విద్యార్థులు 10వ తరగతి పూర్తి చేసుకుని ఇంటర్మీడియట్‌లో చేరే ముందే.. పక్క రాష్ట్రాలకు వెళ్తే స్థానికత కోల్పోయే ప్రమాదం ఉందనే విషయాన్ని పాఠశాల విద్యాశాఖ ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలి.

### కౌన్సెలింగ్ సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్

అడ్మిషన్ల సమయంలో సాఫ్ట్‌వేర్ కేవలం ఆటోమేటిక్ రిజెక్షన్ చేయకుండా, విద్యార్థుల వాస్తవ నేపథ్యాన్ని (తల్లిదండ్రుల నివాసం) పరిశీలించేందుకు ఒక "గ్రీవెన్స్ సెల్" ను ఫిర్యాదుల విభాగం ను ఏర్పాటు చేయాలి.

నవ సమాజ నిర్మాతలైన విద్యార్థుల వేధింపుతో దేశ భవిష్యత్తు సంక్షోభంలోకి వెళుతుంది.

▪ ప్రభుత్వాలు ప్రజలు రాజకీయ ఉద్దేశాలను పక్కనపెట్టి విద్యార్థులను భావి భారత ఆస్తిగా పరిగణించాలి. వసుదైక కుటుంబం అనే మన భారతీయ ఆకాంక్షను తెలుగు రాష్ట్రాలు ముందుగా ఇక్కడ పాటించాలి.

---

## వక్రతుండ బ్రదర్స్ ఆధ్వర్యంలో

## ఘనంగా వినాయక నిమజ్జనం

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

భక్తుల కోలాహలాలు, డప్పు దరువుల మధ్య మేడ్చల్ జిల్లా చెంగిచర్ల డివిజన్‌లో గణపతి నిమజ్జన వేడుకలు అత్యంత వైభవంగా ముగిశాయి. చెంగిచర్ల డివిజన్ పరిధిలోని చిన్నక్రాంతి కాలనీలో 'వక్రతుండ బ్రదర్స్' ఆధ్వర్యంలో



ప్రతిష్ఠించిన గణనాథుని నిమజ్జన మహోత్సవం సోమవారం కన్నులపండువగా, అంగరంగ వైభవంగా జరిగింది. నవరాత్రుల పాటు ధూపదీప నైవేద్యాలతో, రోజూ ప్రత్యేక పూజలందుకున్న లంబోదరుడు భక్తుల కోలాహలం మధ్య వీడ్కోలు తీసుకున్నాడు.

## నిఖిల్ భారత్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

## కబడ్డీలో ప్రథమ స్థానం

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జగిత్యాల జిల్లా జోనల్ స్థాయి అండర్-14 బాలుర కబడ్డీ పోటీల్లో నిఖిల్ భారత్ స్కూల్ మెట్‌పల్లి విద్యార్థులతో కూడిన జట్టు ప్రథమ స్థానం సాధించింది.
పాఠశాల విద్యార్థులు ఆరేపల్లి మౌలిక్, కట్టె అత్యుత్ రాజ్ ఆటలో కీలక పాత్ర పోషించారు.



తమ ప్రతిభను ప్రదర్శిస్తూ జట్టు విజయంలో భాగస్వాములయ్యారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన క్రీడా ఉపాధ్యాయులు ఉపాధ్యాయ బృందాన్ని ప్రిన్సిపాల్ విబి మహర్షి, ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్ అనిత, పాఠశాల యాజమాన్యం అభినందించింది.

# మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఖరీఫ్ పత్తి కొనుగోళ్లు పగడ్బందీ చర్యలు.

▪ ఏం ఎస్ పి తో రైతుల నుంచి పత్తి కొనుగోలు సజావుగా నిర్వహించాలి : అదనపు కలెక్టర్ సంగీత .

**సంగారెడ్డి కరపత్రం ప్రతినిది**
జిల్లాలో వానాకాలం 2026-27 సీజన్‌లో పత్తి కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ ) సంగీత అధికారులనుఆదేశించారు.
కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం లో పత్తి కనీస మద్దతు ధర కొనుగోళ్లపై మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులు, జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ సంగీత మాట్లాడారు. రాష్ట్రంలో పత్తి సేకరణ ప్రారంభమైన వెంటనే అన్ని అధీకృత జిన్నింగ్ మిల్లులను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా రైతులు తమకు సమీపంలోని మిల్లులకు పత్తిని తరలించుకునే అవకాశం కల్పించాలని సూచించారు. జిల్లాలో ఈ సీజన్‌లో 3,57,246 ఎకరాల్లో పత్తి సాగు కాగా, సుమారు 3,16,520 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసిందన్నారు. 2026-27 సీజన్‌కు పత్తి కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 8,667గా నిర్ణయించబడిందని తెలిపారు. రైతుల నుంచి ఎం ఎస్ ఎస్పి తో పత్తి సేకరణలో సిసిఐ కీలకంగా వ్యవహరించనుందని తెలిపారు.ప్రతిపాదిత కొనుగోలు కేంద్రాలకు కొనుగోలు అధికారులను కేటాయించి, నిర్ణీత షెడ్యూల్ ప్రకారం కేంద్రాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. అన్ని జిన్నింగ్ మిల్లుల్లో అవసరమైన సాఫ్ట్‌వేర్‌తో పాటు వెబ్ కెమెరాలు, వేలిముద్ర స్కానర్లు, సక్రమమైన ఇంటర్నెట్ సౌకర్యం, అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మార్కెట్ యార్డులు, జిన్నింగ్ మిల్లుల్లోని వేబ్రిడ్జ్‌లను లీగల్ మెట్రాలజీ శాఖ ద్వారా ధ్రువీకరించి, తూకం






ఖచ్చితత్వాన్ని నిర్ధారించాలని సూచించారు. నిబంధనల ప్రకారం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం పనిచేసేలా చూడాలని ఆదేశించారు.తూనిక యంత్రాల్లో ఎలాంటి తేడాలు లేకుండా లీగల్ మెట్రాలజీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. రైతు దిగుబడి 40 క్వింటాళ్లలోపు ఉంటే ఏఈఓ, 40 క్వింటాళ్లకు మించి ఉంటే ఏఓ ధ్రువీకరణ పత్రం జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అక్టోబర్ 1 నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, అంతర్‌జిల్లా మ్యాపింగ్‌కు సంబంధించిన ప్రతిపాదనలు ఉంటే సెప్టెంబర్ 30లోగా ఖరారు చేసి సిసిఐకి పంపాలని ఆదేశించారు. దీనివల్ల రైతుల రవాణా భారం తగ్గడంతో పాటు స్లాట్‌ల లభ్యత కూడా పెరుగుతుందని అధికారులు తెలిపారు.
జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి శ్రీకాంత్ మాట్లాడుతూ , జిల్లాలో సదాశివపేట, రైకోడ్, నారాయణఖేడ్, జోగిపేట, వట్‌పల్లి, జహీరాబాద్‌లలో ఆరు కాటన్ ఏఎంసీలు ఉన్నాయని, గత సీజన్‌లో 24 జిన్నింగ్ మిల్లులు ఉండగా, ఈ సీజన్‌లో 23 జిన్నింగ్ మిల్లులను ప్రతిపాదించినట్లు వివరించారు. పత్తి కొనుగోళ్లకు ముందే కాపాస్ కిసాన్ యాప్‌లో రైతుల నమోదు, స్లాట్ బుకింగ్, ఎం ఎస్ పి, పత్తి నాణ్యతా ప్రమాణాలు, తేమ శాతం, పత్తిని వదులుగా తీసుకురావడం తదితర అంశాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. మండలాల వారీగా పత్తి సాగు విస్తీర్ణం, ఉత్పత్తి వివరాలతో పాటు రైతుల డేటాను సెప్టెంబర్ 30లోగా ఎన్ ఐ సి ద్వారా కాపాస్ కిసాన్ యాప్‌కు బదిలీ చేయాలని సూచించారు.ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమం ద్వారా కాపాస్ కిసాన్ యాప్‌లో నమోదు, స్లాట్ బుకింగ్, కొనుగోలు కేంద్రాల వివరాలను రైతులకు తెలియజేయాలని సూచించారు. కౌలు రైతుల వివరాలను ఏఈఓలు, ఏఓలు క్రాప్ బుకింగ్ సైట్‌లో నమోదు చేయాలని సూచించారు.జిల్లాలో పత్తి కొనుగోళ్లు సజావుగా, పారదర్శకంగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ సంగీతఆదేశించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి శ్రీకాంత్ ,జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్ ,సంబంధిత శాఖల అధికారులు జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు ,సిబ్బంది పాల్గొన్నారు .

## జహీరాబాద్ ఉద్రిక్తత: పోలీసుల వేధింపులతో బీఆర్ఎస్ కార్యకర్త ఆత్మహత్య.. జాతీయ రహదారిపై ఎమ్మెల్యేల బైఠాయింపు

**సదాశివపేట కరపత్రం ప్రతినిది**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసుల అక్రమ వేధింపులు తాళలేక బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ క్రియాశీల కార్యకర్త గొల్ల శేఖర్ (30) ఆత్మహత్యకు పాల్పడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.
ఒక దొంగతనం కేసు విచారణ పేరుతో పోలీసులు శేఖర్‌ను పిలిపించి, తీవ్రంగా శారీరక, మానసిక హింసకు గురిచేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పోలీసుల టార్చర్ భరించలేకే శేఖర్ ప్రాణాలు తీసుకున్నాడని, ఇది ముమ్మాటికీ ఖాకీల వేధింపుల వల్ల జరిగిన హత్యేనని బంధువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శేఖర్ మృతితో బిలాల్‌పూర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.
జాతీయ రహదారి స్తంభన -- ఎమ్మెల్యేల మద్దతు:
బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, శేఖర్ మృతికి కారణమైన పోలీసు అధికారులపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి, వారిని ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ బంధువులు శేఖర్ మృతదేహంతో 65వ నంబర్ జాతీయ రహదారిపై (ఎన్‌హెచ్ 65) బైఠాయించారు.





బాధిత కుటుంబానికి మద్దతుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కె. మాణిక్ రావు, చింత ప్రభాకర్ నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అధికార బలంతో పోలీసులు అమాయక బీఆర్ఎస్ కార్యకర్తలను టార్గెట్ చేస్తూ ప్రాణాలు తీస్తున్నారని మండిపడ్డారు. శేఖర్ మృతిపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులైన ఎంతటివారినైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే భారీ పరిహారం చెల్లించాలని, అప్పటివరకు ఆందోళన విరమించేది లేదని నేతలు స్పష్టం చేశారు.
రహదారిపై ధర్నాతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోవడంతో జహీరాబాద్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిరసనకారులను బలవంతంగా తరలించేందుకు పోలీసులు ప్రయత్నిస్తుండటంతో అక్కడ ఘర్షణ వాతావరణం కొనసాగుతోంది.

## సంగారెడ్డి జిల్లా జేఎన్టీ యూహెచ్ క్యాంపస్‌లో ర్యాగింగ్ కలకలం.



**సంగారెడ్డి కరపత్రం ప్రతినిది**
సంగారెడ్డి జిల్లాచౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీ యూహెచ్ క్యాంపస్‌లో సెకండ్ ఇయర్ ట్రిపుల్ ఈ విద్యార్థి రుత్విక్‌పై సీనియర్లు ర్యాగింగ్.ర్యాగింగ్‌పై ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేదంటూ విద్యార్థులు 161వ జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు.విద్యార్థుల ధర్నాతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది.

## సదాశివపేటలో ఘనంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయమ్మల సన్మాన కార్యక్రమంబీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల మాణిక్ రావు







**సదాజీపేట కరపత్రం ప్రతినిది**
ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవం సందర్భంగా 'సేవా సంకల్ప్ అభియాన్' అంగన్‌వాడీలకు కేంద్ర నిధులు – దేశ ప్రధానిని ఆశీర్వదించాలి: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల మాణిక్ రావు సదాశివపేటలో భారతీయ జనతా పార్టీ (BJP) తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు, మన ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న "సేవా సంకల్ప్ అభియాన్" లో భాగంగా సదాశివపేట పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు, సిబ్బందికి ఘన సన్మాన కార్యక్రమం (అంగన్ మిలన్ సేవ) నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల మాణిక్ రావు గారు విచ్చేసి, అంగన్‌వాడీ టీచర్లు మరియు ఆయమ్మలను శాలువాలతో ఘనంగా సత్కరించి ధన్యవాదాలు తెలిపారు.
ఈ సందర్భంగా ఓదెల మాణిక్ రావు గారు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా పిల్లలకు ప్రీ ప్రైమరీ విద్యను అందిస్తూ, వారి బాగోగులు చూసుకుంటున్న అంగన్‌వాడీ ఉపాధ్యాయులు మరియు ఆయమ్మల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. ప్రధాని నరేంద్ర మోదీ గారి 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజా సేవకు గుర్తుగా ఈ సేవా సంకల్ప్ అభియాన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి, చిన్నారుల పౌష్టికాహారానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తూ నిధులను సమకూరుస్తోందని, ఇంతటి గొప్ప సంక్షేమ కార్యక్రమాలను అందిస్తున్న దేశ ప్రధాని నరేంద్ర మోడీ గారిని అంగన్‌వాడీ సిబ్బంది ఆశీర్వదించాలని ఆయన కోరారు.
మరోవైపు, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అంగన్‌వాడీల పదవీ విరమణ ప్రయోజనాలను (టీచర్లకు రూ. 2 lakhs, హెల్పర్లకు రూ. 1 lakh) పెంచడం మరియు 'తొలి ముద్ద' బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ ప్రవేశపెట్టడం పట్ల కూడా ఈ సందర్భంగా చర్చ జరిగింది. అంగన్‌వాడీ వ్యవస్థ బలోపేతానికి అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న సంక్షేమ చర్యలను నాయకులు ఈ సందర్భంగా ప్రస్తావించారు.
ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మీనా గౌడ్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తేజశ్రీ, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఊసన్న గారి శ్రీశైలం, పట్టణ ఉపాధ్యక్షుడు కూచిని సతీష్, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు అంబదాస్, ఓబిసి మోర్చ పట్టణ అధ్యక్షుడు గణపురం చంద్ర శేఖర్, ఓబీసీ మోర్చా పట్టణ ప్రధాన కార్యదర్శి లొంక హరికృష్ణ, పట్టణ బిజెపి కౌన్సిలర్ ఉల్లిగడ్డల ఉమారాణి నాగరాజు, గొల్లపల్లి శ్రీనివాస్, ప్రవీణ్ యాదవ్, శివ కుమార్, బీజేవైఎం నాయకులు ధారా రాజేష్, నవీన్ కుమార్, వులి గడ్డల వరుణ్ కుమార్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు బొబ్బిలిగా మా నాగరాజు, స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

## రోడ్డుపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్న యూటర్న్.

**సంగారెడ్డి కరపత్రం ప్రతినిధి.**
సంగారెడ్డి జిల్లా పట్టణ కేంద్రంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో ప్రస్తుత యూటర్న్ వద్ద కొందరు వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తూ రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తుండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మరోవైపు భారీ వాహనాలు యూటర్న్ తీసుకునే సమయంలో రహదారిపై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.
పెద్ద వాహనాలు మలుపు తిరిగే క్రమంలో వెనుక నుంచి వచ్చే వాహనాలు నిలిచిపోవడంతో తరచూ ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది.దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రమాదాల నివారణతో పాటు ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలంటే ప్రస్తుత యూటర్న్‌ను మూసివేసి, కొంత ముందుకు అనువైన ప్రదేశంలో ఏర్పాటు చేయడం అవసరమని వాహనదారులు అభిప్రాయపడుతున్నారు. సంబంధిత ట్రాఫిక్ అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి, క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## సదాశివపేట బస్టాండ్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసిన బీజేపీ నాయకులు






**సదాశివపేట కరపత్రం ప్రతినిది**
**సదాశివపేట,**
హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, దేశ ప్రజల మరియు హిందూ బంధువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడిన తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వెంటనే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ సదాశివపేట పట్టణ బస్టాండ్ వద్ద బీజేపీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.
ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించిన సంగారెడ్డి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి ఓదెల మాణిక్యరావు మాట్లాడుతూ, ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి బాధ్యతారహితంగా హిందూ దేవుళ్లను విభజిస్తూ మాట్లాడటం శోచనీయమన్నారు. దేశంలో ఉన్న హిందువుల మధ్య చీలిక తెచ్చేలా ఆయన చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.
ఈ నిరసన కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మీనా గౌడ్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తేజశ్రీ, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఊసన్న గారి శ్రీశైలం, పట్టణ ఉపాధ్యక్షుడు కూచిని సతీష్, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు అంబ మరియు ఇతర బీజేపీ అనుబంధ విభాగాల నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## సదాశివపేటలో ఘనంగా 'వరల్డ్ హార్ట్ డే' వేడుకలుబాలాజీ హాస్పిటల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు, సైకిల్ ర్యాలీ

**సదాశివపేట కరపత్రం ప్రతినిది**
సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో ప్రపంచ హృదయ దినోత్సవం (వరల్డ్ హార్ట్ డే) పురస్కరించుకుని బాలాజీ హాస్పిటల్ ఆధ్వర్యంలో గుండె ఆరోగ్యంపై అవగాహన సదస్సులు, వివిధ సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.
**ఐబీ నుండి గాంధీ చౌక్ వరకు భారీ సైకిల్ ర్యాలీ:**
గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవడంలో శారీరక శ్రమ ప్రాధాన్యతను వివరిస్తూ స్థానిక ఐబీ (IB) సర్కిల్ నుండి గాంధీ చౌక్ వరకు భారీ సైకిల్ ర్యాలీని చేపట్టారు. ఈ ర్యాలీని ప్రముఖ నాయకురాలు, TGIIC చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మారుతున్న జీవనశైలి కారణంగా గుండె జబ్బుల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని, ప్రతి ఒక్కరూ వ్యాయామం అలవర్చుకుని గుండెను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.




సీపీఆర్ విధానంపై ప్రత్యక్ష అవగాహన:
కార్యక్రమంలో భాగంగా స్థానిక గాంధీ చౌక్ వద్ద అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు రక్షించే సీపీఆర్ (కార్డియోపల్మోనరీ రిససిటేషన్) ప్రక్రియపై ప్రజలకు ప్రత్యక్ష అవగాహన కల్పించారు. గుండెపోటు వచ్చిన తక్షణమే ఆసుపత్రికి చేర్చే లోపు చేయాల్సిన ప్రాథమిక చికిత్స పద్ధతులను బాలాజీ ఆసుపత్రి వైద్య సిబ్బంది ప్రజలకు వివరించారు.
**ఉచిత మెడికల్ క్యాంప్:**
అనంతరం స్థానిక బసవ సేవ సదన్‌లో పట్టణ ప్రజల కొరకు ఉచిత మెడికల్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో వందలాది మంది ప్రజలకు ఉచితంగా




గుండె పరీక్షలు (ECG, BP, మరియు షుగర్ పరీక్షలు) నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు.
ఈ కార్యక్రమంలో తోపాజి అనంత కిషన్ సదాశివపేటపట్టణ మున్సిపల్ చైర్మన్ మునుపల్లి అంజమ్మ వైస్ చైర్మన్ రేణుక చిరు కౌన్సిలర్లు మహమ్మద్ సజీ అరుణ్ పట్టణ అధ్యక్షుడు నాగరాజు గౌడ్ విష్ణువర్ధన్ రెడ్డి
బాలాజీ హాస్పిటల్ మేనేజ్మెంట్, వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.